ఆలోచించిన హేస్టన్ వెంటనే టేబిల్ దగ్గర కెళ్ళి కాగితం తీసుకొని ఇలా రాశాడు:

"సుజా! మరోసారి కలుసుకుందామని వాగ్దానం చేశావు. ఈరోజు యిదేమిటి? ఒక్కసారి కన్పించు. నేను వెళ్ళిపోవటమే నీ ఆదేశం ఐతే తప్పకుండా వెళ్ళిపోతాను. కాని వెళ్ళేముందు నీ దగ్గర సెలవు తీసుకొందేమటుకు నే నిక్కడినుండి కదలలేను. ఎప్పుడొచ్చేది తెలియజేయ్.

హేస్టన్."

వైకుంఠం తాలూకు నౌకరు కుర్రాడు తెచ్చి యిచ్చిన ఉత్తరం చూసుకుని ఖంగారుపడింది సుజాత. మరోసారి అతనితో కలిసి మాట్లాడటం తనకేమాత్రం మంచిది కాదని, వద్దని మనసు చెప్తోంది. కాని తప్పదు. సాయంత్రం వస్తాననీ, ఆరుగంటలకు పార్కు దగ్గరకు వచ్చి నిలబడతానని, వచ్చి తీసుకెళ్ళమని జవాబు రాసింది.

రాసి పంపడం పంపింది కానీ మళ్ళీ భయం! పార్కుదగ్గర యెవరయినా చూసే దీని పర్యవసానం యేమిటి? అలాగని వెళ్ళకుండా ఉందామా అంటే తిరస్కరించటానికి మనసు వప్పుకోవడంలేదు. ఇంటికీ పార్కుకీ నాలుగు ఫర్లాంగులుకూడా లేదు. సుజాత అదృష్టం. ఆరోజు ఉదయంనుంచి మబ్బు మబ్బుగా వున్న వాతావరణం సాయంత్రం అయేసరికి కారు చీకటిలా మూసుకుపోయి కుండపోతలా వర్షం కురవటం మొదలుపెట్టింది.

వాన రాబోతుండటంవల్ల గాబోలు, పీథుల్లో ఎవరూ మనుష్యులు లేరు. పార్కుగూడా నిర్మానుష్యంగా ఉంది. టపటపమని రాలుతున్న పెద్ద పెద్ద చినుకుల్లో సుజాత భుజాలచుట్టూ షాల్ వేసుకుని బయట కొచ్చింది.

సుజాత పార్కు దగ్గరకు వస్తూనే ప్రక్కగా నిలబడి ఉన్న కారుని చూసింది. సుజాతను చూస్తూనే కారు స్టార్టుచేసి డోర్ తెరిచాడు హేస్టన్. సుజాత కూర్చోగానే కారు కదిలింది. ఎంత ధైర్యం తనకి! ముక్కు, మొహం తెలియని ఈ అమెరికన్ పిలిస్తే రావటం - ప్రక్కన కూర్చోడం ఎంత సాహసం! ఒంటిమీద స్పృహఉండే చేస్తోందా- అన్పించింది.

